# అహోబిలక్షేత్రవైభవం

ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు

ఎమెస్కో

# అహోబిలక్షేత్రవైభవం

## ప్రస్తావన

సృష్టి, స్థితి, లయకారులైన త్రిమూర్తులలో స్థితికారుడైన శ్రీమహావిష్ణువు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం దశావతారాలను ఎత్తాడు. అట్టి దశావతారాల్లో నాలుగవ అవతారం – శ్రీనరసింహావతారం! సింహం తల, మానవ శరీరంతో దుష్ట దానవుడైన హిరణ్యకశిపుడిని అంతమొందించి తన భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించేందుకు ధరించిన అవతారమే – నరసింహావతారం! విష్ణుమూర్తి స్తంభం నుంచి ఉద్భవించి దుష్టుడైన హిరణ్యకశిపుడిని అంతమొందించిన ప్రాంతంలో నెలకొన్న క్షేత్రం...

"అహోబిలం"!

### శ్రీనరసింహావతారం

పూర్వం ఒకసారి సనకసనందాది మహర్షులు శ్రీమహావిష్ణువు దర్శనార్థం వైకుంఠానికి చేరుకున్నారు. వైకుంఠంలో ద్వారపాలకులైన జయ, విజయులు శ్రీమహావిష్ణువు వద్దకు వెళ్ళనీయకుండా వారిని అడ్డుకున్నారు. దీనితో కోపోద్రిక్తులైన మహర్షులు – "మీరు వైకుంఠానికి, శ్రీమన్నారాయణుడికి దూరమవుదురుగాక..." అని శపించారు. దీనితో జయ, విజయులు శ్రీమహావిష్ణువును శరణు కోరారు. ఆ సమయంలో శ్రీమహావిష్ణువు...

"మహర్షుల శాపమునకు తిరుగులేదు... అనుభవించ వలసిందే... అయితే మీరు నా భక్తులు కనుక మీకు ఒక వరం ప్రసాదిస్తాను... మీరు నా భక్తులుగా ఏడు జన్మలు కానీ లేదా విరోధులుగా మూడు జన్మలుగానీ భూలోకంలో జన్మించిన తర్వాత వైకుంఠానికి చేరుకుంటారు" అని వరం ప్రసాదించాడు.

విష్ణువు మాటలను విన్న జయ, విజయులు...

"మహానుభావా! మేము మిమ్ములను విడిచి ఏడు జన్మలు ఉండలేము... మూడు జన్మలు శత్రువులుగానే గడుపుతాము" అని పలికారు.

దీని ప్రకారం...

జయ విజయులు మొదటి జన్మలో కృతయుగంలో హిరణ్యాక్ష, హిరణ్యకశిపులు గాను; రెండో జన్మలో త్రేతాయుగంలో రావణ, కుంభకర్ణులు గాను; ఇక మూడవ జన్మలో ద్వాపరయుగంలో శిశుపాల దంతవక్త్రులుగా జన్మించారు. వీరందరూ శ్రీహరికి శత్రువులు.

కాగా, హిరణ్యాక్షుడు ఒకసారి భూమిని తీసుకువెళ్ళి పాతాళంలో దాచిపెట్టాడు. దీనితో శ్రీమహావిష్ణువు యజ్ఞవరాహ అవతారాన్ని ధరించి పాతాళానికి వెళ్ళి తన కోరలతో హిరణ్యాక్షుని వధించి భూమిని ఉద్ధరించాడు. సోదరుడైన హిరణ్యాక్షుని సంహరించినందుకు శ్రీమహావిష్ణువుపై ప్రతీకారం తీర్చుకునేందుకు హిరణ్యకశిపుడు సిద్ధమయ్యాడు. పాలన బాధ్యతలను మంత్రులకు అప్పగించి మందర పర్వతం చేరుకుని బ్రహ్మదేవుడిని గురించి తపస్సు చేయడం ప్రారంభించాడు. హిరణ్యకశిపుడి కఠోర తపస్సును మెచ్చి సృష్టికర్త బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకోమనగా...

"భూమిమీద కానీ, ఆకాశంలో కానీ, నీటిలో కానీ, అగ్నిలో కానీ, పగలు కానీ, రాత్రి కానీ, దేవతలవల్ల కానీ, మానవులవల్ల కానీ, జంతువులవల్ల కానీ, ఇంటిలోపల గానీ, ఇంటిబయట గానీ, ఆయుధాలవల్ల కానీ మరణం లేకుండా వరం ప్రసాదించండి" అని హిరణ్యకశిపుడు వరం కోరాడు.

బ్రహ్మదేవుడు వరం ప్రసాదించాడు. వర గర్వంతో హిరణ్యకశిపుడు విజృంభించి ముల్లోకాలను స్వాధీనం చేసుకున్నాడు. సకల లోకవాసులను ఇబ్బందులపాలు చేయసాగాడు. తన శత్రువైన శ్రీహరిని అంతమొందించేందుకు సిద్ధమయ్యాడు. శ్రీహరి నామాన్ని కూడా ఎవరూ పలకకూడదనే ఆదేశాన్ని కూడా అమలుచేశాడు.

అటువంటి హిరణ్యకశిపుడికి నలుగురు కుమారులు. వారిలో పెద్దవాడు – 'ప్రహ్లాదుడు'. చిన్నతనం నుంచే శ్రీహరి భక్తుడు. కుమారుడిలోని హరిభక్తిని సహించలేని హిరణ్యకశిపుడు హరిభక్తిని మానమని కుమారుడికి చెప్పాడు. ప్రహ్లాదుడు హరిభక్తిని మానలేదు. దీనిని సహించలేని హిరణ్యకశిపుడు చివరకు కుమారుడిని చంపేందుకు కూడా వెనుకాడలేదు. అందుకై ఎన్నో ప్రయత్నాలు చేశాడు. అవేమీ ఫలించలేదు చివరకు ఒకనాడు...